క్లుప్తంగా

సమగ్ర విచారణ జరిపించాలి



ఖలీల్‌వాడి/నిజామాబాద్‌అర్బన్: రుద్రూర్‌లో ఇటీవల జరిగిన వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థిని రక్షిత మృతి ఘటనపై సమగ్ర విచారణ జరపాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, యూఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది సూరి అన్నారు. ఈమేరకు వారు విద్యార్థి, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని సీపీ కార్యాలయంలో డీసీపీకి వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ.. విద్యార్థిని మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. అధికారులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఘటన వివరాలను తెలుసుకోవడానికి వెళ్లిన విద్యార్థి సంఘాల నాయకులపై నమోదైన కేసులను వెనక్కి తీసుకోవాలని కోరారు. నాయకులు కార్తీక్, వనమాల సత్యం, నర్సయ్య, నాగరాజ్, ప్రిన్స్, మహేష్, దేవిక, రవీందర్, రాకేష్, జవహర్, సురేందర్ పాల్గొన్నారు.

అన్నదాతలను ఆదుకోవాలి



నిజామాబాద్ రూరల్: రాష్ట్రవ్యాప్తంగా కురిసిన భారీ వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం పంట నష్టపరిహారం అందించి, ఆదుకోవాలని, ఇందుకోసం యుద్ధప్రాతిపాదికన చర్యలు చేపట్టాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు అన్నారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. తెగిన రోడ్లు, కల్వర్టులరే త్వరితగతిన మరమ్మతులు చేయాలన్నారు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల దినసరి కూలీలకు ఉపాధి కరువైందన్నారు. ప్రభుత్వం అలాంటి పేదలకు నిత్యావసర సరుకులను అందజేసి, ఆదుకోవాలన్నారు. నాయకులు పెద్ది వెంకట్రాములు, నూర్జహాన్, జిల్లా కమిటీ సభ్యురాలు సుజాత తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అలీసాగర్ వరద నీటి విడుదల



బోధన్: ఎడపల్లి మండలంలోని అలీసాగర్ రిజర్వాయర్ వరద నీటి విడుదల రెండో రోజు మంగళవారం కొనసాగింది. భారీ వర్షాల కారణంగా ఎగువ ప్రాంతం నుంచి అలీసాగర్ రిజర్వాయర్‌లోకి వరద నీరు చేరి పూర్తి స్థాయిలో నిండిపోగా, నీటిపారుదల శాఖ అధికారులు ముందు జాగ్రత్తగా సోమవారం ఒక గేటు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. మంగళవారం ఉదయం రిజర్వాయర్ రెండు గేట్లు ఎత్తి వరద నీటిని దిగువకు విడుదల చేశారు. మధ్యాహ్నం తర్వాత రెండు గంటల పాటు నీటి విడుదల నిలిపివేశారు. సాయంత్రం మళ్లీ ఒక గేటు తెరిచారు. వరద నీరు చేరిక తగ్గుముఖ పట్టడంతో అధికారులు నీటి విడుదల విషయంలో జాగ్రత్తలు పాటించారు. నీటిపారుదల శాఖ ఈఈ సయ్యద్ మహ్మద్ జానీ, డీఈ లోక్య నాయక్‌లు నీటి విడుదలను పర్యవేక్షిస్తున్నారు.

కాలువలు ఆక్రమిస్తే చర్యలు



మోర్తాడ్(బాల్కొండ): చెరువుకు సంబంధించిన కాలువలు, శిఖం భూములను ఆక్రమించి నిర్మాణా లు చేపడితే కఠిన చర్యలు తప్పవని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి హెచ్చరించారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆయన భీమ్‌గల్ పట్టణంలోని మొఘల్ చెరువు, అయ్యప్పనగర్ కాలనీలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మొఘల్ చెరువు మాటు కాలువ కబ్జాకు గురికావడంతో అయ్యప్పనగర్ కాలనీ మొత్తం జలమయమైందని చెప్పారు. ఈ సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించడంతో పాటు కబ్జాకు గురైన భూములను వెలికి తీస్తామన్నారు. రాష్ట్ర సహకార సంఘ అసోషియేషన్ కార్పొరేషన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట్ అన్వేష్‌రెడ్డి, బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి, పార్టీ నేత బొదిరె స్వామి తదితరులున్నారు.

సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ
- మున్సిపల్ అధికారులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్‌అర్బన్: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సమస్యలకు తక్షణమే పరిష్కారం లభించడం లేదని, వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అధికారులను ఆదేశించారు. నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం ఆయన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగరంలో ఆయా డివిజన్‌లలో సమస్యలు అలాగే ఉన్నాయని ప్రజలు తమ దృష్టికి తీసుకువస్తున్నారని ఎందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నించారు. శానిటేషన్ విభాగంలో అవకతవకలు జరిగినట్టు తమ దృష్టికి వచ్చినట్లు పేర్కొన్నారు. రెవెన్యూ విభాగంలో పన్నుల వసూలు మందగించిందని దీనిపై ఎందుకు దృష్టిసారించడం లేదని అడిగారు. నగరంలో చాలావరకు రోడ్లు దెబ్బతిన్నాయని, అయినా సకాలంలో బాగు చేయడం లేదన్నారు. కానీ బిల్లులు మాత్రం పొందుతున్నారన్నారు. గత కొన్ని రోజులుగా రోడ్ల మరమ్మతులు అభివృద్ధి పనులకు సంబంధించి ఎలాంటి పనులు చేపట్టారు, ఎన్ని నిధులు ఖర్చు చేశారు, డివిజన్‌ల వారీగా వివరాలను నివేదికను తమకు వారంలోగా సమర్పించాలని కమిషనర్ ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ పరిధిలో భవనాల అనుమతులు ఎలా ఇస్తున్నారని నియమ, నిబంధనలను పరిశీలిస్తున్నా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే సెల్లార్‌లలో వ్యాపార సముదాయాలు నిర్వహిస్తున్న వారు చాలా ఉన్నారని ఎంతమందికి నోటీసులు ఇచ్చారు? వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు అని అడిగి తెలుసుకున్నారు, తక్షణమే సెల్లార్లో వ్యాపారం నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సానిటేషన్ విభాగంలో గైర్హజారు ఎక్కువగా నమోదవుతున్నట్లు ఆయా ప్రాంతాలలో నామమాత్రపు పనులు జరుగుతున్నట్లు తెలుస్తుందని అధికారులను ప్రశ్నించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. సానిటేషన్ విభాగంలో త్వరలోనే బయోమెట్రిక్ విధానం అందుబాటులోకి వస్తుందని ప్రతి కార్మికుడు అందుబాటులో ఉండేవిధంగా చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యేకు వివరించారు. అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి అదనపు బాధ్యతలు ఎక్కువ ఇవ్వకుండా రెగ్యులర్ ఉద్యోగులనే ఉండేలా చూడాలన్నారు. సెక్షన్‌ల వారీగా ఆయా విభాగాలను ఎమ్మెల్యే సమీక్షించారు. కమిషనర్ మకరందు, డిప్యూటీ కమిషనర్ శంకర్, వివిధ విభాగాల ఇన్‌చార్జిలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఖానాపూర్‌కు వెళ్లే రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నిలిచిన వర్షపునీరు

గుంతల రోడ్డుపై అవస్థల ప్రయాణం

ఖానాపూర్‌కు వెళ్లే ప్రధాన రోడ్డు గుంతలు తేలి ప్రమాదకరంగా మారింది. దీనికితోడు వర్షపు నీరు గుంతల్లో నిల్వ ఉండటంతో ప్రయాణికులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. –సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి





నగరంలోని నాలుగో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న సీఐ నరహరి.. రెండో టౌన్‌లో..

ఖలీల్‌వాడి/ఇందల్వాయి: ప్రజలు ప్రశాంత వాతావరణంలో పండుగలను జరుపుకోవాలని పోలీసులు సూచించారు. నగరంలోని 2వ, 4వ, 6వ టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో మంగళవారం వివిధ మతాలకు చెందిన పెద్దలతో పోలీసులు శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ నరహరి, సౌత్ టౌన్ సీఐ సురేష్, ఎస్సైలు యాసీన్ ఆరాఫత్, శ్రీకాంత్, వెంకట్రావు మాట్లాడుతూ.. ఆయా వర్గాల ప్రజలకు పలు సూచనలు, సలహాలు చేశారు. పండుగల సందర్భంగా ఇతరులకు ఇబ్బందులు కలిగించవద్దని తెలిపారు. గణపతి మండపాల ఏర్పాటు కోసం అనుమతి తీసుకోవాలన్నారు. అలాగే ఇందల్వాయి పోలీస్‌స్టేషన్‌లో డిచ్‌పల్లి సీఐ మల్లేశ్ శాంతి కమిటీ సమావేశం నిర్వహించి, మాట్లాడారు. వినాయక మండపాల వద్ద డీజేలు పెట్టి, పెద్ద శబ్దాలతో ప్రజలకు ఇబ్బంది కలిగించవద్దన్నారు. సమావేశాల్లో గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు, మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



ఆరో టౌన్‌లో..



ఇందల్వాయిలో..

త్వరితగతిన తాత్కాలిక మరమ్మతులు

- పంచాయతీరాజ్ ఎస్ఈ ప్రభాకర్
- పలు గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న రహదారుల పరిశీలన





పాంగ్రాలో వాగును పరిశీలిస్తున్న అధికారులు.. ఎల్లమ్మకుంట రోడ్డులో స్తంభాన్ని సరిచేసిన అధికారులు

సిరికొండ/నిజామాబాద్ రూరల్/ఇందల్వాయి/మోపాల్: వర్షాలకు ధ్వంసమైన రోడ్లకు త్వరితగతిన తాత్కాలిక మరమ్మతులు పూర్తి చేస్తామని పంచాయతీరాజ్ ఎస్ఈ ప్రభాకర్ తెలిపారు. సిరికొండ మండలంలో వర్షాలకు ధ్వంసమైన రోడ్లను మంగళవారం ఆయన పరిశీలించారు. పాకాల–తూంపల్లి మధ్య వంతెన వద్ద కోతకు గురైన రోడ్డును, మీరిబాయితండా వద్ద తెగిపోయిన రోడ్డును పరిశీలించారు. రాకపోకల పునరుద్ధరణ కోసం ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతులు చేపడతామని, వర్షాకాలం అనంతరం శాశ్వత మరమ్మతులు చేపడతామని తెలిపారు. నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు రూపొందించాలని ఆయన డీఈ హైమద్ హుస్సేన్‌ను ఆదేశించారు. సిరికొండ మండలంలోని గడ్కోల్ సెక్షన్ పరిధిలో 3 ట్రాన్స్‌ఫార్మర్లు, 16 స్తంభాలు, సిరికొండ సెక్షన్ పరిధిలో 4ట్రాన్స్‌ఫార్మర్లు, 8 స్తంభాలు ధ్వంసమైనట్లు ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. మండలంలోని గడ్డమీదితండా నుంచి కొండాపూర్ వెళ్లే మార్గంలో మొండి వాగు ప్రవాహానికి వంతెన వద్ద కోతకు గురైన రోడ్డు కు, గోప్యతండా నుంచి గంటతండాకు వెళ్లే మార్గంలో వంతెన వద్ద కోతకు గురైన రోడ్డుకు అధికారులు మరమ్మతులు చేపట్టారు. నిజామాబాద్ రూరల్ మండలంలో తహసీల్దార్ అనురుద్ పర్యటించారు. పాంగ్రా శివారులో వాగు పక్కన గుడిసెలు వేసుకుని నివసిస్తున్న ప్రజలను బ్యాంక్ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌కు తరలించారు. మోపాల్ మండలంలోని ఎల్లమ్మకుంట వెళ్లే దారిలో నేలకొరిగిన వి ద్యుత్ స్తంభాన్ని విద్యుత్‌శాఖ ఏఈ బాబా శ్రీనివాస్ పర్యవేక్షణలో సిబ్బంది సరిచేశారు.

ఇందల్వాయి మండలంలోని లోలం గ్రామంలో ప్రధాన కూడలి వద్ద పెద్ద ఎత్తున వర్షపు నీరు నిలవడంతో గ్రామస్తులు ఎమ్మెల్యే భూపతిరెడ్డికి సమాచారం అందించారు. ఎమ్మెల్యే అధికారులను అప్రమత్తం చేయడంతో నీటిని తొలగించి, మరమ్మతులు చేపట్టారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.







లోలం గ్రామంలో రోడ్డుపై నిలిచిన నీటిని తొలగిస్తున్న సిబ్బంది.. సిరికొండ మండలంలో కప్పలవాగు ఉధృతికి కోతకు గురైన పొలం.. కొట్టుకుపోయిన రోడ్డు

గణేశ్ మండపాలకు అనుమతి తప్పనిసరి

- నిర్వాహకులు నిబంధనలు పాటించాలి
- నగర సీఐ నరహరి

ఖలీల్‌వాడి: నగరంలో గణేశ్ మండపాల ఏర్పాటు కు నిర్వాహకులు అనుమతి తప్పనిసరి తీసుకోవాల ని నగర సీఐ నరహరి తెలిపారు. ఈమేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రజ లు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, మండపాల ని ర్వాహకులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. మండపాల నిర్వాహకులు తాము ఏర్పాటు చేసే గణేష్ ప్రతిమఎత్తు, ఏర్పాటుచేస్తున్న ప్రదేశం. నిమజ్జనం తేదీ, ప్రదేశం మొదలైన సమాచారంతో తెలంగాణ పోలీస్ శాఖ అధ్వర్యంలో నిర్వహిస్తున్న వెబ్‌సైట్ https://policeportal.tspolice.gov.in ద్వారా లాగిన్ అయి పూర్తి వివరాలను నమోదు చేసుకోని రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అనంతరం సంబంధిత స్టేషన్ పోలీస్ అధికారులు ఆన్‌లైన్ ద్వారా అనుమతులు జారీచేస్తారన్నారు. రిజిస్ట్రేషన్ అయ్యాక పోలీస్ స్టేషన్ నుంచి వచ్చే అనుమతితో పాటు క్యూఆర్ కోడ్, వారు జారీ చేసిన సూచనల పట్టికను మండపం వద్ద అందరికీ కనపడేవిధంగా ఉంచాలన్నారు. గణేష్ మండపాల నిర్వాహకులు వారి మండపాల కమిటీ వివరాలు, ఫోన్ నెంబర్లతో కూడిన ఫ్లెక్సీలను మండపం వద్ద ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి గణేష్ ప్రతిమ వెంట ఐదుగురు నిమజ్జన బాధ్యత కోసం వారు ప్రత్యేక టీషర్ట్స్‌లో ఉండాలని తెలిపారు. వృద్ధులు, చదువుకునే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తక్కువ శబ్దంతో రెండు స్పీకర్లను ఒక మైక్ మాత్రమే ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎట్టిపరిస్థితుల్లో డీజేను ఏర్పాటు చేయరాదన్నారు. గణేష్ మండపాల వద్ద మద్యం సేవించడం, పేకాట ఆడటం, లక్కీ డ్రాలు నిర్వహించడం, అన్యమతస్తులను కించపరిచే విధంగా ప్రసంగాలు చేయడం, పాటలు పాడటంపై పూర్తిగా నిషేధమన్నారు. విధిగా పాయింట్ పుస్తకం ఏర్పాటు చేసుకోవాలి, పోలీసు అధికారులు తనిఖీకి వచ్చినప్పుడు అందులో రాసి సంతకం చేస్తారు. మండపాల్లో ఏదైనా అనుమానాస్పదంగా బ్యాగులు, ప్లాస్టిక్ సంచులు, వస్తువులు లేదా వ్యక్తులు కనిపించినట్లయితే తక్షణమే డయల్ 100 గాని లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

అధికారుల తప్పిదం.. రైతులకు శాపం

- తీసుకున్న రుణం కంటే అధికంగా రికార్డుల్లో నమోదు
- సిరికొండ మండలంలో రుణమాఫీ పొందని పలువురు అన్నదాతలు



రైతు సమాచారపత్రంలో రూ.2.20 లక్షలుగా ఉన్న పంట రుణ వివరాలు



బ్యాంకు స్టేట్‌మెంట్‌లో రూ.1.93 లక్షలను చూపుతున్న రాములు

సిరికొండ: రాష్ట్ర ప్రభు త్వం ఇటీవల ప్రతిష్టాత్మకంగా రైతులకు రూ. 2లక్షల లోపు రుణమా ఫీ పథకం చేపట్టింది. కానీ మండలంలోని ప లువురు అర్హులైన రైతు లు, అధికారుల తప్పిదాల కారణంగా రుణమాఫీ పొందలేకపోయారు. ప్రభుత్వ ని బంధనల ప్రకారం రూ.2లక్షలలోపు రుణం తీసుకు న్నా, రికార్డుల్లో రూ.2లక్షల కన్నా అధికంగా రుణం నమోదు కావడంతో రుణమాఫీ పొందలేకపోయామని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

మండలంలోని తాటిపల్లి గ్రామానికి చెందిన బుక్య రాములు, బుక్య సీత భార్యభర్తలు. వీరు గతంలో తూంపల్లి పీఏసీఎస్‌లో స్వల్పకాలిక పంట రుణం తీసుకున్నారు. బుక్య రాములు తన పేరు మీద రూ.1.17 లక్షలు, సీత పేరు మీద రూ.76వేలు రుణం తీసుకోగా, ఇద్దరిది కలిపి రూ.1.93లక్షల రుణం ఉంది. కానీ రుణమాఫీ వివరాల్లో రూ. 2.20 లక్షల రుణం తీసుకున్నట్లు నమోదుకావంతో వీరికి రుణమాఫీ కాలేదు. రుణం తీసుకున్న పీఏసీఎస్ వారిని సంప్రదిస్తే మీ రుణం రూ.1.93 లక్షలు మాత్రమే ఉందని స్టేట్‌మెంట్ ఇచ్చారని బుక్య రాములు తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదిస్తే మీ రుణం రూ2.20 లక్షలు ఉందని, ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినప్పుడు పైనవి రూ.20వేలు కడితే మీకు రూ.2లక్షల రుణమాఫీ అవుతుందని చెబుతున్నారని బాధితుడు వాపోయాడు. అలాగే తాటిపల్లి గ్రామానికి చెందిన మరో రైతు తాటి చంద్రయ్య సిరికొండలోని బ్యాంక్ ఆఫ్ బరోడాలో రూ. 95వేల రుణం తీసుకున్నాడు. కానీ వ్యవసాయ శాఖ రికార్డుల్లో రూ. 3లక్షలు రుణం తీసుకున్నట్లుగా నమోదైంది. దీంతో వారికి రుణమాఫీ కాకపోవడంతో అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొండూర్ గ్రామానికి చెందిన చెల్లెం లక్ష్మీ బ్యాంక్ ఆఫ్ బరోడాలో రూ.రెండు లక్షల లోపు రుణం తీసుకున్నారు. కానీ సిరికొండ పీఏసీఎస్‌లో ఆమె రుణం తీసుకోకున్నా, ఆమె పేరు మీద 2016లో రూ.58,124 రుణం తీసుకున్నట్లు నమోదైంది. దీంతో వీరు రుణమాఫీకి దూరమయ్యారు. రేకుల్‌పల్లికి చెందిన దోర్నాల ా రెడ్డి సిరికొండ పీఏసీఎస్‌లో 2021లో పంట రుణం తీసుకున్నారు. రుణమాఫీ జాబితాలో సొసైటీలో 2008లో రూ.5వేల రుణం తీసుకోగా వడ్డీతో కలిపి ప్రస్తుతం రూ. 11 వేలు బకాయి ఉన్నట్లు రికార్డుల్లో చూపుతోంది. కానీ బాధితుడు 2021లోనే రుణం తీసుకున్నానని, బాకీ ఉంటే కొత్తగా లోన్ ఎలా ఇచ్చారని ఆయన ప్రశ్నిస్తున్నాడు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రికార్డుల్లో నమోదైన తప్పుడు వివరాలను సరిచేసి, రుణమాఫీ అందించాలని అన్నదాతలు కోరుతున్నారు.

అర్బన్ ఎమ్మెల్యేను కలిసిన నాయకులు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న బీజేవైఎం నాయకులు

సుభాష్‌నగర్:నగరంలోని అర్బన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణను, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడిగా ఇటీవల నియమితులైన పానుగంటి సతీష్‌రెడ్డి, పార్టీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ధన్‌పాల్‌ను ఆయన సన్మానించారు. అనంతరం సతీష్‌రెడ్డిని ఎమ్మెల్యే అభినందించారు. బీజేవైఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దోమల మందు పిచికారీ



మోపాల్: నగర శివారులోని 5వ డివిజన్ బోర్గాం (పి)లోగల పలు కాలనీల్లో మంగళవారం వైద్య శాఖ, మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. ఈసందర్భంగా ఇళ్ల పరిసరాల్లో చెత్తాచెదారం తొలగించారు. బోర్గాం హెల్త్ సబ్ సెంటర్ పరిధిలో 5 డెంగీ కేసులు నమోదు అయినట్లు వైద్యుడు సంతోష్‌కుమార్ తెలిపారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా, చెత్తాచెదారం లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. మలేరియా అధికారి రాజేందర్, ఏఎన్ఎం లత, వార్డు అధికారి అరుణ, జవాన్ రాజు పాల్గొన్నారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	160
		లైవ్	100
స్కిన్‌లెస్	200	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	74,100	వెండి (కిలో)	87,800
22 క్యారెట్స్	68,357		


– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	14	24	గాజరుగడ్డ	30	50
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	20	40
బీరకాయ	35	50	దోసకాయ	20	40
దొండకాయ	30	50	ఆలుగడ్డ	30	50
బీర్నిసుకాయ	50	70	గోబిగడ్డ	20	40
కాకరకాయ	30	60	గోబిపువ్వు	30	50
వంకాయ	10	20	బీట్‌రూట్	30	50
పాలకూర	80	120	కరివేపాకు	40	60
మెంతికూర	80	120	చామగడ్డ	40	60
కొత్తిమీర	100	130	గోరుచిక్కుడు	30	50
పుదీనా	70	90	చిక్కుడుకాయ	45	70
క్యాప్సికం	40	60			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-2	సరిపోదా శనివారం (తెలుగు)- 1.00, 4.10, 7.20 ,10.30
స్క్రీన్-3	గబ్బర్ సింగ్ (తెలుగు) - 10.30, 1.30 4.30, 7.30, 10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	తంగలాన్(తెలుగు)-11.50 సరిపోతు శనివారం-3.10,6.45,10.20
స్క్రీన్-2	స్త్రీ-2 (హిందీ)- 12.15, 3.30, 6.45 గబ్బర్‌సింగ్ (తెలుగు) - 10.20
స్క్రీన్-3	కాలం రాసిన కథలు - 10.05 కమిటీకుర్రోళ్లు (తెలుగు) - 1.10 నేను కీర్తన (తెలుగు) - 4.25 ఆయ్ (తెలుగు) - 7.40 స్త్రీ-2 (హిందీ) - 10.45
స్క్రీన్ -4	సీతారాం సిత్రాలు (తెలుగు) - 9.40 సరిపోదా శనివారం (తెలుగు) - 12.30 తంగలాన్ (తెలుగు) - 4.05 డిమోంటీకాలనీ-2 -7.25,10.35
లలితామహల్	సరిపోదా శనివారం (తెలుగు)
దేవి	తంగలాన్ -11.00, 2.15, 6.00 గబ్బర్‌సింగ్ (తెలుగు) - 9.15 (రాత్రి)
నటరాజ్	గబ్బర్‌సింగ్ (తెలుగు)
విజయ్	గబ్బర్‌సింగ్ (తెలుగు)

నల్లా బిల్లుల పేరుతో ప్రజలను వేధించొద్దు



ఖలీల్‌వాడి/నిజామాబాద్‌అర్బన్: నగర ప్రజల వద్ద నల్లా బిల్లులు వసూలు చేసే క్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు వేధించొద్దని, వెంటనే ఉన్నతాధికారులు స్పందించి ఇబ్బందులకు గురిచేసే సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ గడుగు రోహిత్ కోరారు. ఈమేరకు ఆయన కాంగ్రెస్ నేతలతో కలిసి మంగళవారం మున్సిపల్ కమిషనర్ మంద మకరందుకు ఫిర్యాదు చేశారు. రోహిత్ మాట్లాడుతూ.. నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు కొందరు బిల్లులు వసూలు చేసే క్రమంలో సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. అలాంటి వారిపై ప్రజలు స్థానికంగా ఉన్న కాంగ్రెస్ నాయకులను సంప్రదించాలన్నారు. అధికారులు తమ నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి ప్రజల నుంచి బిల్లులను బలవంతంగా వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాయకులు నవాజ్, మోయిన్, సయ్యద్ అర్షాద్, షేక్ జాకీర్, వేణురాజ్ తదితరులు పాల్గొన్నారు.